www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -157 సోమవారం 21 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ప్రతి ఇంటా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి

అభివృద్ధి ఆగకూడదు.. పర్యావరణానికి గాయం చేయకూడదు

బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభంలో సీఎం చంద్రబాబు



**బెంగళూరు, సెప్టెంబర్ 20(ప్రజావినికిడి):** పకృతికి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తు తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రతి ఇల్లూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కేంద్రం కావాలని, అప్పుడే సాధారణ విద్యుత్ ఉత్పత్తిపై భారం తగ్గనుందని అన్నారు. ఆదివారం బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో సంపూర్ణ పర్యావరణానికి అనుకూలమైన విస్టా స్పేసెస్ ఎకో ఫ్రెండ్లీ విధానంలో నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్' భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను నిర్మించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీ సైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ఈ భవనంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భవనం ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం చంద్రబాబు మిగతా2లో...

## ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు

● పశ్చిమ బెంగాల్‌లో 38.2 లక్షల అప్పీళ్లలో 22.2 లక్షలు తొలగించిన ఓటర్లవే ● విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చిన ట్రిబ్యునళ్లు : కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి




**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 20 (ప్రజావినికిడి):**పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా తొలగించిన ఓటర్లలో 82 శాతం మంది తమ పేర్లను తిరిగి చేర్చాలని అప్పీల్ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం.. సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎన్నికల జాబితా నుంచి పేర్ల తొలగింపు, తిరిగి చేర్పు ప్రక్రియపై కొనసాగుతున్న న్యాయపరమైన పరిశీలనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఎన్నికల సంఘం సమర్పించిన గణాంకాల ప్రకారం.. ప్రత్యేక ట్రైబ్యునళ్ల ముందు మొత్తం 38.2 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిలో 22.2 లక్షల అప్పీళ్లు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన నిర్ణయాలకు వ్యతిరేకంగా దాఖలైనవే. సవరణ ప్రక్రియలో తొలగించి విచారణకు ఉంచిన 27 లక్షల మంది ఓటర్లతో పోలిస్తే ఇది సుమారు 82 శాతానికి సమానం. మరోవైపు, ఓటర్లను జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ కనీసం 16.1 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. ఈ అప్పీళ్లను మిగతా2లో...

## అద్వానీ, జైశంకర్‌కు 'సర్' నోటీసులు

ఎన్నికల కమిషనర్ సంధు, ఆర్మీ మాజీ చీఫ్ ద్వివేది, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు కూడా

జాబితాలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఎంపీ సిబల్ తదితర ప్రముఖులు




## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దే...

ఆ భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం

విషప్రచారాన్ని నమ్మొద్దు : రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ప్రజావినికిడి):** దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిగతా2లో...

## ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

● అజీజ్‌నగర్ అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు

● కేటీఆర్ లీజు డ్రామాలు, బినామీ ఆస్తుల బాగోతం

● కాంగ్రెస్ క్షేత్రస్థాయి పర్యటనలు..రాజకీయ ఉద్రిక్తతలు



**మొయినాబాద్, సెప్టెంబర్ 20(ప్రజావినికిడి):** తెలంగాణలో గత బీఆర్ఎస్ పాలనలో బాగోతాలను ప్రజల ఫామ్‌హౌస్‌ల సంస్కృతి విపరీతంగా పెరిగిపో యిందని, అజీజ్‌నగర్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో అనేక అక్రమాలు, రేవ్ పార్టీలు జరిగా యని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 'ఫామ్‌హౌస్ ఫైల్స్' నడుస్తున్నా యని, రంగనాయక సాగర్ నుంచి మొదలుపెట్టి ఎర్రవెల్లి, జన్వాడ, అజీజ్ నగర్ వరకు ఉన్న ఫామ్‌హౌస్‌ల మిగతా2లో...




## ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?: మంత్రి బండి

## కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోంది: హరీష్‌రావు



**హైదరాబాద సెప్టెంబర్ 20(ప్రజావినికిడి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా మిగతా2లో...

## నేడు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్

- 1500 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రేపు కాకినాడలో జనసేన ఎన్నికల సన్నాహక సమావేశం




## నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత



**హైదరాబాద్: సెప్టెంబర్ 20(ప్రజావినికిడి):** తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన 'పాంచజన్య మిగతా2లో...

# ప్రతి ఇంటా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. నగరాలు పూర్తిగా కాంక్రీట్‌మయంగా మారాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే విధానం వస్తోందన్నారు. కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణహిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని స్పష్టం చేశారు.

**పర్యావరణ సమస్యలను అధిగమిద్దాం**

వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న సవాల్ అని చంద్రబాబు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. భవన నిర్మాణాల్లో నెట్ జీరో విధానాన్ని అవలంబించాలని, సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యమివ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతోపాటు రీయూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని కొనియాడారు. ఇలాంటి పర్యావరణహిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని... ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమని సూచించారు. స్వచ్ఛమైన విద్యుత్తును ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి ఇంటి పైకప్పును ఒక పవర్ ప్లాంట్‌గా మార్చవచ్చని, ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించుకోవచ్చని, ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చుకోవచ్చన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనన్నారు. వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచరుల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఇదే స్ఫూర్తిని పట్టణాభివృద్ధిలోనూ అవసరమని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ 'ది ఎర్త్ సెంటర్' ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచినేని, ప్రవీణ్‌కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని చంద్రబాబు అభినందించారు.

**అమరావతి ల్యాండ్ పూలింగ్ అద్భుతం: డీకే ప్రశంసలు**

మరావతిలో అమలుచేసిన ల్యాండ్ పూలింగ్ స్కీంపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసల వర్షం కురిపించారు. ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో వివిధ ప్రాంతాల అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, కొత్త నగరాలు, కొత్త ప్రాంతాల అభివృద్ధికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ ప్రస్థానంలో ఎదురయ్యే ఇబ్బందులకు చంద్రబాబు అమలుచేసిన ల్యాండ్ పూలింగ్ స్కీం మార్గనిర్దేశం చేసిందన్నారు. ల్యాండ్ పూలింగ్‌ను చంద్రబాబే తొలిసారి అమలుచేశారని ప్రశంసించారు. ఈ విధానాన్ని చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. అభివృద్ధిలో భూములిచ్చిన వారిని భాగస్వాములను చేయడమనేది చాలా మంచి ఆలోచనగా పేర్కొన్నారు. చంద్రబాబు ముందుచూపు, నిబద్ధత కలిగిన నేత అని కొనియాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబుదే కీలక భూమిక అన్నారు. మరో అందమైన అమరావతి నగరం నిర్మించే అవకాశం ఆయనకు దక్కిందన్నారు. బెంగళూరు పరిధి దాటి అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ 1.4 కోట్ల మంది జనాభా ఉంటే... 1.3 కోట్ల వాహనాలు ఉన్నాయని చెప్పారు. ఇక్కడి రోడ్లను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. దక్షిణ భారత్‌లో మేధస్సుకు కొదవలేదన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది కీలకమన్నారు. సంపూర్ణ పర్యావరణానికి అనుకూలమైన భవన నిర్మాణానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. విస్టా స్పేసెస్ జాయింట్ ఎండీ రఘువీర్ వీరమాచనేని, శ్వేత, రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

(మొదటి పేజీ తరువాయి)

పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.

**భూమిలేని పేదలకు హక్కులు కల్పించాం**

భూమిలేని పేదలకు భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. 'దళితులకు సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' మంత్రి భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని స్పష్టం చేశారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. భూముల రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ... విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

(మొదటి పేజీ తరువాయి)

ముందుంచు తున్నామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ నేతలు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో పర్యటించి, ఫామ్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అజీజ్‌నగర్‌లోని ఆ ఫామ్‌హౌస్ అసైన్డ్ భూమి అని, 111 జీఓ పరిధిలో ఉన్న ఆ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకునే అధికారం రోహిత్ రెడ్డికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరోజు ఆగర్భ శ్రీమంతులం అంటారని, మరొక రోజు తమకు హైదరాబాద్‌లో ఇల్లు కూడా లేదని డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్.. సత్యం రామలింగరాజు కంపెనీ భూముల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, నార్సింగిలో ఉంటున్నానని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో ఈగల్ ఫోర్స్ దాడులు చేసి ఏం జరిగిందో అందరికీ తెలుసని, అమెరికాలో చదువుకుని వచ్చి కేటీఆర్ తెలంగాణలో నేర్పిన సంప్రదాయం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ ఏడాది మార్చిలో పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో డ్రగ్స్ వ్యవహారం బట్టబయలైందని తెలిపారు. అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో డ్రగ్స్ తాగినట్టు తేలిందని, పైలట్ రోహిత్ రెడ్డి తమ్ముడు రితేష్ రెడ్డి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు చెందిన కేదార్ అనే వ్యక్తికి రూ.25 లక్షలు చెల్లించారని ఆరోపించారు. ఆ తర్వాత ఆ కేదార్ 2025లో దుబాయ్‌లో డ్రగ్ ఓవర్ డోస్‌తో మరణించాడని తెలిపారు. నార్త్ ఇండియాకు చెందిన ఆ వ్యక్తులతో వారికి ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్, రేవ్ పార్టీలకు అడ్డాలుగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తన ఫామ్‌హౌస్‌ను ప్రదీప్ రెడ్డి పేరు మీద రాయించి, ఆ భూములను తన భార్య, అత్త కుటుంబ సభ్యుల పేర్ల మీద మార్చుకున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ దందాల అసలు బాగోతం తెలంగాణ ప్రజలకు తెలియాలనే తాము క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని ఫామ్‌హౌస్‌ల పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకుల అసలు బండారం త్వరలోనే ప్రజల ముందు పూర్తిగా బయటపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ వద్ద పోలీసుల బందోబస్తు**

షాబాద్ మండలం మద్దూర్ గ్రామ శివారులోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ వద్ద పోలీసులు ఆదివారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు అక్కడికి వస్తారన్న సమాచారంతో ఇన్‌స్పెక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు ఫామ్‌హౌస్ వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు అక్కడే విధులు నిర్వహించారు. అయితే ఈ సమయంలో కాంగ్రెస్ నేతలు ఎవరూ అక్కడికి రాకపోవడంతో పోలీసులు తిరిగి షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

# ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?: మంత్రి బండి

**హైదరాబాద్: సెప్టెంబర్ 20 (ప్రజావినికిడి):** కాంగ్రెస్ నేతలు కెసిఆర్ ఫాంహౌస్ భూముల సందర్శనకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. "ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?.. అధికార పార్టీ నేతలు అక్కడికి వెళ్లడమేంది?.. ప్రైవేట్ వ్యక్తుల భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారు?.. పాంహౌస్‌లో సర్కార్ భూములుంటే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది.. ఆ విషయాన్ని వదిలేసి ఈ రాజకీయ డ్రామాలేంది?" అని మండి పడ్డారు. కెసిఆర్ కుటుంబం, బిఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్ల భూదోపిడీ చేసినట్లు ఆధారాలుంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు భయపడి కాంగ్రెస్ పార్టీ అనర్హత కేసులో స్టే కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిందని ఎద్దేవా చేశారు. ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌ను రాజకీయ ఆదివారం మధ్యాహ్నం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ట్రైసైకిల్స్, ఫాగ్ మిషన్స్ అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో చెత్త సేకరణ కోసం ప్రతి డివిజన్‌కు ఒక ట్రై సైకిల్‌ను మున్సిపల్ సిబ్బందికి అందజేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ఫాగ్ మిషన్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నా మన్నారు. రూ.17 కోట్లతో బయోమైనింగ్ పనులకు టెండర్లు మొదలు కాబోతున్నాయన్నారు. రూ.80 యూసీఎఫ్ నిధులతో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పనులు చేపట్టబోతున్నామన్నారు. 16 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్ మెంట్ పనులను ప్రారంభించబో తున్నామన్నారు.కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్ సందర్శన పెద్ద జోక్ అని అన్నారు. ప్రైవేట్ భూములను సందర్శించడానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు అధికారం ఎక్కడిదన్నారు. ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూములుంటే అధికారులను పంపి స్వాధీనం చేసుకోవాలని, వాటికి సంబంధించిన ఆధారాలను సిఎం బయటపెట్టాలన్నారు. 22ఏ జాబితాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు 22ఏను తమకు అనుకూలంగా వాడుకున్నారన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు. ఉప ఎన్నికలో పోటీ బిజెపి, బిఆర్ఎస్ మధ్యనే ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ను జనం అసహ్యించుకుంటున్నారన్నారు. దానం నాగేందర్ తనను తాను ఖైరతాబాద్ వినాయకుడితో పోల్చుకోవడం ఆశ్చర్యమన్నారు. వినాయుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయాన్ని దానం నాగేందర్ గుర్తుంచుకొని జాగ్రత్త పడితే మంచిదన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను రాజకీయ నిమజ్జనం చేయడం తథ్యమన్నారు.

# ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరు దాఖలు చేశారనే విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టంగా వెల్లడించలేదు.

**విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం చేర్పులు**

మొత్తం 38.2 లక్షల అప్పీళ్లలో సుమారు 1.2 లక్షల కేసులను మాత్రమే అప్పటికి ట్రైబ్యునళ్లు పరిష్కరించాయి. అంటే మొత్తం అప్పీళ్లలో 3.1 శాతం కేసులపై మాత్రమే నిర్ణయం వెలువడింది. ఏప్రిల్‌లో ట్రైబ్యునళ్లు అప్పీళ్ల విచారణ ప్రారంభించాయి. కోర్టుకు సమర్పించిన అనుబంధ గణాంకాల ప్రకారం.. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93 శాతం కేసుల్లో ఓటర్లను తిరిగి ఎన్నికల జాబితాలో చేర్చారు.

**లక్షలాది ఓటర్లపై సవరణ ప్రభావం**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టారు. ఫిబ్రవరిలో విడుదలైన తుది జాబితాలో తొలుత 61 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు చేర్చబడలేదు. అనంతరం అనుబంధ జాబితాలు, విచారణ ప్రక్రియ ద్వారా సుమారు 60 లక్షల అనుమానాస్పద, పెండింగ్ కేసులను పరిశీలించే ప్రక్రియ కొనసాగింది. ఏప్రిల్ 6 నాటికి సుమారు 91 లక్షల మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయని నివేదికలు పేర్కొన్నాయి. ఇది సవరణ ప్రారంభానికి ముందు ఉన్న పశ్చిమ బెంగాల్ మొత్తం ఓటర్ల సంఖ్యలో దాదాపు 11.9 శాతం. దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తొలగింపుల ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడిందా అనే అంశంపైనా పలు విశ్లేషణలు వెలువడ్డాయి.

# అద్వానీ, జైశంకర్‌కు 'సర్' నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (ప్రజావినికిడి):** దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఎన్నికల సంఘం పలువురు పౌరులతో పాటు ప్రముఖుల పేర్లను ఎడాపెడా తొలగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడటం ప్రధాన లక్ష్యంగా 'సర్' నిర్వహించాల్సి ఉండగా, అది పూర్తిగా దారితప్పుతున్నట్టు కనిపిస్తున్నది. తాజాగా సాక్షాత్తూ ఎన్నికల కమిషనర్ ఎస్ఎస్ సంధు, కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్, ఆయన భార్య క్యోకో జైశంకర్, బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి 'సర్' నోటీసులు జారీ అయ్యాయి.వీరు కాక, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, అతని కుటుంబ సభ్యులు, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, అతని కుటుంబం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, అతని భార్య, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి రంజన దేశాయ్, కుటుంబ సభ్యులు, ఎంపీ కపిల్ సిబల్, కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరు కాక ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, అతని కుటుంబ సభ్యులు, అద్వానీ కుమార్తె ప్రతిభా అద్వానీకి కూడా ఈసీ ఇప్పటికే నోటీసులు అందజేసింది. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ప్రకాశ్ రాజ్, ఎంపీ రాఘవ్ చద్దా, న్యూఢిల్లీ ఎంపీ బాన్సురి స్వరాజ్, బీజేపీ ఢిల్లీ మాజీ అధ్యక్షుడు వీరేంద్ర కుమార్ సచ్‌దేవా తదితరులకు నోటీసులు జారీ అవ్వడం వివాదాస్పదమైంది.

# నేడు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్

**పిఠాపురం, సెప్టెంబర్ 20 ((ప్రజావినికిడి):** కేరళంలో చికిత్స అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. సోమ, మంగళవారాల్లో ఈ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించడంతో పాటు రూ.1500 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంగళవారం పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవరణలో నిర్వహించే బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోంది: హరీష్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్ కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.

# నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.."నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేద్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు.ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే కోడంగల్ వచ్చానని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్ఘనిస్తాన్‌తో సమానంగా ఉందని, రాష్ట్రంలో విద్యా బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

# తెలంగాణలో 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు..

**హైదరాబాద్ సెప్టెంబర్ 20(ప్రజావినికిడి):** తెలంగాణలో విద్యార్థులకు దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు 13 రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ సెలవులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు వర్తిస్తాయి. సెలవులకు ముందు అక్టోబర్ 1 నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

# ఈ నెల 22 నుంచి రైతు రిజిస్ట్రేషన్..



**హైదరాబాద్ సెప్టెంబర్ 20 (ప్రజావినికిడి):** రాష్ట్రంలో రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. రైతులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాలకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. విత్తనాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటల కొనుగోళ్లకు, ఎరువుల విక్రయాల కోసం, బ్యాంకుల ద్వారా రుణాల పొందేందుకు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకురైతు ఐడీ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, భూమి వివరాలు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రైతులు తమకు కేటాయించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇఓ) వద్ద లేదా సంబంధిత సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 22 నుంచి - 30 వరకు గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫార్మర్ ఐడీ నమోదు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 21 సెప్టెంబర్ 2026

# బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా

## "తీన్మార్ మల్లన్న"14,500 కి.మీ.మహా పాదయాత్ర

**గోల్కొండ కోట నుంచి ప్రారంభమైన పాదయాత్ర షాద్‌నగర్‌కు చేరిక**

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ తెలంగాణ రాజ్య అధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న చేపట్టిన పాదయాత్ర షాద్‌నగర్‌కు చేరుకుంది. గోల్కొండ కోట నుంచి ప్రారంభమైన ఈ యాత్రను బీసీ రాజ్యాధికార యాత్రగా ఆయన అభివర్ణించారు.తెలంగాణ వ్యాప్తంగా సుమారు 14,500 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

సెప్టెంబర్ 17న పెరియార్ రామస్వామి జయంతి,విశ్వకర్మ జయంతి సందర్భంగా, తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పాదయాత్ర ప్రారంభించినట్లు మల్లన్న తెలిపారు.

**బీసీ రాజ్యాధికారమే పాదయాత్ర లక్ష్యం..**

ఇటీవల రాష్ట్రంలో చేపట్టిన వివిధ సర్వేల గణాంకాల్లో బీసీల జనాభా గణనీయంగా ఉన్నట్లు వెల్లడైందని మల్లన్న పేర్కొన్నారు.జనాభాలో బీసీలు అధికంగా ఉన్నప్పటికీ రాజకీయంగా,

సామాజికంగా వారికి తగిన ప్రాతినిధ్యం ఎందుకు దక్కడం లేదని ప్రశ్నించారు.బీసీలకు రాజ్యాధికారం సాధించడమే తమ పాదయాత్ర ప్రధాన లక్ష్యమని అన్నారు.

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై విమర్శలు..**

కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ 21 హామీలు ఇచ్చిందని, వాటిలో అనేక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని తీన్మార్ మల్లన్న విమర్శించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి బిల్లు పెట్టారని,అయితే దాని అమలుపై స్పష్టత లేదని ఆరోపించారు.

బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం చెబుతుంటే,మరోవైపు దాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి అని మల్లన్న వ్యాఖ్యానించారురైతు భరోసా భూస్వాములకుఅప్పులు మాత్రం బడుగు బలహీన వర్గాలకు

రైతు భరోసా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకువస్తోందని మల్లన్న ఆరోపించారు.ఈ అప్పుల భారాన్ని చివరకు ప్రజలే భరించాల్సి వస్తుందని అన్నారు.బీసీల కోసం కేటాయిస్తున్న నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు కావడం లేదని ఆరోపిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

**అసెంబ్లీలో బీసీ మహిళల ప్రాతినిధ్యంపై ప్రశ్నలు**

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి తెలంగాణ అసెంబ్లీలో బీసీ మహిళలకు తగిన ప్రాతినిధ్యం లేదని మల్లన్న పేర్కొన్నారు.మహిళల ప్రాతినిధ్యంలో బీసీల వాటా తక్కువగా ఉందని,ముస్లిం మహిళల ప్రాతినిధ్యం కూడా లేదని ఆయన వ్యాఖ్యానించారు



**షాద్‌నగర్‌లో ఎస్టి హాస్టళ్లను పరిశీలించిన మల్లన్న**

షాద్‌నగర్‌కు చేరుకున్న వెంటనే ఎస్టీ హాస్టల్‌ను సందర్శించినట్లు మల్లన్న తెలిపారు.హాస్టల్‌లో సరైన వసతులు లేవని, బాత్రూమ్‌లు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నాయని ఆరోపించారు.

బీసీ,ఎస్సీ,ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.పేదల భూములు కొట్టి పెత్తందారులకు కట్టబెడుతున్నారన్న ఆరోపణలు

రాష్ట్రంలో భూవివాదాలు,భూ బదలాయింపుల విషయంలో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మల్లన్న ఆరోపించారు.పేదల భూములను అక్రమంగా పేరు మార్పిడి చేసుకుని స్వాధీనం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.



**బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాదయాత్ర**

బీసీలు,ఎస్సీలు,ఎస్టీలు, మైనారిటీల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే పాదయాత్ర ఉద్దేశమని తీన్మార్ మల్లన్న తెలిపారు.

తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ హాస్టళ్లలో వసతులు తదితర అంశాలపై ప్రజలతో చర్చిస్తూ పాదయాత్ర కొనసాగిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో షాద్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెస్ సంతోష్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు

# షాద్ నగర్ పట్టణంలో పలు గణపయ్య మండపాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్, (ప్రజావినికిడి):**

పట్టణంలోని డ్రీమ్ ల్యాండ్,ఏ బి విల్లాస్,జి హెచ్ ఆర్,టీచర్స్,విజయ్ నగర్,భగత్ సింగ్, రతన్,గంజి, గాంధీ నగర్ తదితర కాలనీలలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేశ్ మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమాలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,దైవచింతనతో పాటు తోటి వారికి సాయం చేయడం,ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారానే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని అన్నారు.గణేశ్ ఉత్సవ కమిటీలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడమే కాకుండా,ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో అందే బాబయ్య, కౌన్సిలర్ లు నడికూడ అనిత రఘునాథ్ యాదవ్,లక్ష్మి ప్రసన్నవేణు గోపాల్,బీఎస్ సుధీర్,గౌస్ జానీ,ఎస్పి శివ,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య,నందకిషోర్,ఈశ్వర్ రాజు,చింటూ ప్రతాప్ రెడ్డి,చెట్ల నర్సిమ,సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి,ఆలుగడ్డ ప్రవీణ్,మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి,పాత్రికేయులు వేణు, నాయకులు,శ్రీకాంత్ గౌడ్,చక్రం రెడ్డి,దినేష్ సాగర్,మహేశ్వర్,నడికూడ సంతోష్ యాదవ్,శ్రీశైలం గౌడ్ (లడ్డు )మేకల వెంకటేష్ యాదవ్,అభిలాష్, ప్రవీణ్,సత్యం,తదితరులు పాల్గొన్నారు.

# మొగిలిగిద్ద,కందివనం,అయ్యవారిపల్లిలో వినాయక మండపాల సందర్శన

**అన్నదాన,పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**షాద్ నగర్, (ప్రజావినికిడి):**

వినాయక నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గంలోని ఫరుక్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద,కందివనం,అయ్యవారిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు .ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇల్లూ ఆనంద నిలయంగా మారి అందరికీ శుభాలు కలగాలని,దగణనాథుడు సకల శుభాలను అందించి అన్నివేళలా అందరికీ శుభాలను కలుగజేయాలని, ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఈ నవరాత్రుల పూజలు ఘనంగా జరగాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మండపాల వద్దకు చేరుకోవడంతో నిర్వాహకులు,భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ గౌస్ జానీ,మొగిలిగిద్ద సర్పంచ్ బుగ్గ క్రిష్ణ,కందివనం సర్పంచ్ అమృ నాయక్ నాయక్,మాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మి రమేష్,అయోధ్యపూర్ మాజీ సర్పంచ్ గోపాల్



నాయక్,మొగిలిగిద్ద ఉపసర్పంచ్ రాము,కందివనం ఉపసర్పంచ్ యాదగిరి,చించొడ్ కంటెస్టెడ్ సర్పంచ్ బాల్ రాజ్,నాయకులు శంకరయ్య గౌడ్,శివ,అన్వారీ రాజు,బాల్ రాజ్,వెంకట్ రెడ్డి,డాక్టర్ అంజయ్య, గోపాల్ గౌడ్,శివ,రమేష్ ముదిరాజ్, లక్ష్మణ్, మల్లేష్,బాలకృష్ణ, మధుసూదన్ రెడ్డి, ప్రశాంత్ కుమార్,శివ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యువ నాయకులను తీర్చిదిద్దేందుకు యూత్ 4 ఇంపాక్ట్ ప్రారంభం




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన జాతీయ యువ నాయకత్వ అభివృద్ధి కార్యక్రమం యూత్ 4 ఇంపాక్ట్ ను బెంగళూరులోని పీఈఎస్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించారు. వందలాది మంది విద్యార్థుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తొలి నగరంగా బెంగళూరు నిలిచింది. బెంగళూరులో 600 మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొననుండగా, దేశవ్యాప్తంగా 3,600 మందికి పైగా యువతను ఇందులో భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొంది.జాగృతి యాత్ర భారతదేశంలోని ఏఐఈఎస్ఈసీ ప్రకటించిన యూత్ 4 ఇంపాక్ట్ కార్యక్రమం రిలయన్స్ ఫౌండేషన్ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించబడుతోందనీ వెల్లడించింది.

# ఎంబిఎస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి బైరి వెంకటేశం డిమాండ్**



**ఆడిడ్స్, (ప్రజావినికిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం 57ఎంబిఎస్సి (అత్యధికంగా వెనుకబడిన షెడ్యూల్డ్ కులాలు)ల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 57 ఎంబిఎస్సి కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో సమితి నేతలతో కలిసి ఆయన మాట్లాడారు.57 ఎంబిఎస్సి కులాలకు ఆర్డిఒ ద్వారా కాకుండా ఎంఆర్ఓ నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. రోస్టర్ కేటాయింపులో ఎస్సి గ్రూప్-1, గ్రూప్-3లో ఉన్న 40 కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అన్ని రంగాల్లో దళితులందరికీ సమాన అభివృద్ధి జరిగేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ ఈ దఫా 57 ఎంబిఎస్సి కులాలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. 22ఏ ప్రకారం సేకరించిన భూములను దళితులకు పంచుతామనడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంబీఎస్సీ కులాల నేతలు మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని బైరి వెంకటేశంకు ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమితి నేతలు రాయిల లక్ష్మీ నరసయ్య బిందు,కర్నే రామారావు, ఇటిక్యాల బిక్షపతి,ఉపాదె సనాదన్,కురువ బాలరాజు, కోర్లపాటి రామకృష్ణ, పంబాల ఎల్లేష్, తల్వారే పరమేష్ మాంగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్టు సమీపంలో వాహనాల తనిఖీ

**24 మద్యం బాటిల్ల స్వాధీనం**



**నాంపల్లి, (ప్రజావినికిడి):** హైదరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ టీం రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో పలుకారులలో వచ్చిన 24 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు.మద్యం బాటిల్ లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాస్ తెలిపారు.ద

# 170 ఐ ఎస్ డి బ్లాస్ట్ పట్టివేత

**2.6 గ్రాముల ఎల్ ఎస్ డి బ్లాస్ట్ స్వాధీనం**



**నాంపల్లి, (ప్రజావినికిడి):**

ఎల్ ఎస్ డి బ్లాస్ట్ ఒకటి నాలుక మీద వేసుకుంటే చాలు.24 గంటల పాటు మత్తులో మునిగి తేలడానికి ఈ ఎల్ ఎస్ టి బ్లాస్ట్ పనిచేస్తుంది.ఒక ఎల్ ఎస్ టి బ్లాస్ట్ విలువ రూ. 3 వేల నుంచి 5 వేల వరకు ఉంటుంది. ఇది బయట ఎక్కడ దొరకవు. కానీ డార్క్ లాంటి వెబ్సైట్ లంచ్ కొనుగోలు చేస్తే ఎవరో వ్యక్తి తవ చెప్పిన అడ్రస్కు తెలియకుండా ఇచ్చి పోతారు అమ్మిన వారెవరో తెలవదు కొనుగోలు చేసిన వారి ఎవరో తెలవదు కానీ వినియోగించేవారు మాత్రం ఈ కేసులో ఇద్దరు పట్టుపడ్డారు. షేక్ అప్రోచ్ అలీ (26),మండల అజయ్ (22) ఇద్దరి వద్ద 170 ఎల్ ఎస్ డి బ్లాస్ట్ ఎక్సైజ్ ఎస్టిఎఫ్ ఏ టీం సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి స్వాధీనం చేసుకున్నారు.పట్టుకున్న 170 ఎల్ ఎస్ డీ బ్లాస్ట్ విలువ రూ. 65,000గా ఉంటుందని అంచనా వేశారు.ఇద్దరి నిందితులను 170 ఎల్ ఎస్ డి బ్లాస్ట్ మొత్తం 2.6 గ్రామ్స్ ను కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# నిత్యావసరాలు సామాన్యుడికి అందని ద్రాక్ష!

## ధరల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ ఏదీ? -పెంచినప్పుడు పెంచేస్తారు.. తగ్గినా తగ్గించరా?

**సెప్టెంబర్ 20 (ప్రజావినికిడి):**
నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ ధరల నియంత్రణ కొరవడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం తినే టిఫిన్ నుంచి వేసవిలో తాగే కొబ్బరి నీళ్ల వరకు ఏది కొనాలన్నా ధరలు చూసి సామాన్యుడు గుండె గుభేల్‌మంటున్న పరిస్థితి నెలకొంది.

**ధర పెరిగితే పదిరెట్లు భారం?**

ప్రభుత్వం ఏదైనా వస్తువు ధరను స్వల్పంగా పెంచితే స్థానిక మార్కెట్‌లో మాత్రం అంతకుమించి ధరలు పెంచి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు మార్కెట్‌లో సరుకుల ధరలు తగ్గినా కొందరు వ్యాపారులు మాత్రం గతంలో పెంచిన ధరలనే కొనసాగిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి.

**కొబ్బరి నీళ్లు.టిఫిన్ ధరలూ పైపైకే**

ఒకప్పుడు లీటర్ కొబ్బరి నీళ్లు సుమారు రూ.80కు లభించేవని, ప్రస్తుతం రూ.120 వరకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే గతంలో సుమారు రూ.1520 మధ్య లభించిన టిఫిన్ ప్లేట్ ధరలు ప్రస్తుతం గణనీయంగా పెరిగాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. పూరీ, ఇడ్లీ, దోశ ఏది తిన్నా జేబుకు చిల్లు పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాభావ పరిస్థితులు, పంటల దిగుబడి తగ్గడం వంటి కారణాలతో కొంతమేర ధరలు పెరగడం సహజమే అయినప్పటికీ, వాటిని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



**తోపుడు బండ్ల వెనుక కిరాయి దందా?**

షాపుల ముందు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకునే వారి నుంచి కొందరు దుకాణ యజమానులు నెలకు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు కిరాయి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము భారీగా కిరాయి చెల్లించాల్సి వస్తోందని, సరుకుల ధరలు కూడా పెరిగాయని, అందువల్ల ధరలు తగ్గించడం సాధ్యం కాదని కొందరు తోపుడు బండ్ల నిర్వాహకులు చెబుతున్నట్లు సమాచారం.

దుకాణాల అద్దెలు, ఇతర ఖర్చుల భారం చివరకు వినియోగదారుడిపైనే పడుతోందని ప్రజలు అంటున్నారు.

**ధరల దోపిడీని ప్రశ్నిస్తే ఆగ్రహం**

ధరల పెరుగుదలపై ప్రశ్నిస్తున్న విలేకరులపైనా కొందరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వార్తలు రాస్తే శాపనార్థాలు పెడుతున్నారని, ఒకసారి ధర నిర్ణయించిన తర్వాత మార్కెట్‌లో ధరలు తగ్గినా తాము తగ్గించేది లేదన్న ధోరణిలో కొందరు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ధరలు పెరిగినప్పుడు వెంటనే పెంచుతున్న వ్యాపారులు.మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు ఎందుకు తగ్గించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతమేర తనిఖీలు నిర్వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అంతంతమాత్రపు ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెరుగుతున్న ధరల భారం మరింత పెరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధిక ధరలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకుని సామాన్యుడికి ఉపశమనం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నాదెండ్ల సందేశం....

## జనసేనకు ఎన్ని సీట్లు ?



జనసేన ఈసారి అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి భారీగానే ఆశలు పెట్టుకుంది. మరీ ముఖ్యంగా గ్రౌండ్ లెవెల్ లో ఉన్నద్వితీయ తృతీయ శ్రేణి నాయకులు, అలాగే క్యాడర్ కూడా ఎక్కువ సీట్లు పోటీ చేయాలని చూస్తున్నారు. దాని వల్ల తమకు అవకాశాలు వస్తాయని పదేళ్లకి పైగా పార్టీ కోసం పడిన కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని కూడా భావిస్తున్నారు. ఇక గత కొంతకాలంగా జనసేనలో ఉన్న అభిప్రాయాలు వారి ఆలోచనలకు తగిన విధంగా అధినాయకత్వం కూడా రియాక్ట్ అయింది. జనసేన 2024 ఫార్ములాతో కాదని 2026 కి వచ్చేసరికి బలం పెరిగింది కాబట్టి ఎక్కువ సీట్లు దక్కాలని కూడా నేతల నుంచి డిమాండ్ వచ్చింది. దానికి తగినట్లుగానె 30 శాతం ఫార్ములా అన్నది ఇపుడు ప్రచారంలో ఉంది.

జనసేన పెద్దలు ఈ మధ్య దాకా చెప్పినట్లుగా 30 శాతం సీట్ల సర్దుబాటు కనుక అమలు అయితే ఏపీలో ఉన్న 17 కార్పోరేషన్లలో అయిదారు మేయర్ పీఠాలు దక్కాలి. అలాగే ఎనభై కి పైగా ఉన్న మునిసిపాలిటీలు నగర పాలికలలో 30 దాకా లభించాయి. ఇక 28 దాకా ఉన్న జెడ్పీ పీఠాలలో తొమ్మిది దాకా లభించాలి. రెండు వందల జడ్పీటీసీలు, వేలాదిగా ఉన్న ఎంపీటీసీలు కూడా పొత్తు వాటాలో దక్కాలి. మరి ఈ విధంగానే ఆశలు పెంచుకుని జనసేన నేతలు దిగువ స్థాయిలో పని చేసుకుని పోతున్నాయి. అయితే జనసేనలో నంబర్ టూ అయిన మంత్రి నాదెండ్ల మనోహర్ అయితే తాపీగా చెప్పాల్సింది చెబుతున్నారు. అదేంటి అంటే ఎక్కువగా అంచనాలు పెంచుకోవద్దు అని. దాంతోనే ఇపుడు జనసేన నేతలలో కొత్త రకం ఆందోళన పెరిగిపోతోంది అని అంటున్నారు. విశాఖలో తాజాగా జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో జనసేన నంబర్ టూ నేత అయిన నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు అయితే ఆ పార్టీలో రాజకీయ కలకలం రేపుతున్నాయి. ఆయన అన్నది చూస్తే జనసేనకి 60-70 సీట్లని ఎక్స్పెక్ట్ చేయడం మంచిది కాదు అని. అనే కాదు పదవి అధికారంతో పాటు పార్టీకి బాధ్యత కూడా ఉంది అని అన్నారు. , మనం గెలిచే సీట్లు తప్పకుండా తీసుకుందామని మరో మాట అన్నారు. ఇక ఆయన చెప్పినది చూస్తే కూర్చొన్న కొమ్మను నరుక్కోవద్దు అన్న సందేశం కూడా ఉంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆలోచనలను సైనికులే అర్థం చేసుకోకపోతే ఎలా అని కూడా నాదెండ్ల ప్రశ్నించారు.

అదే మీటింగులో నాదెండ్ల మరిన్ని వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. సంస్థాగతంగా జనసేన ఇంకా బలపడాల్సి ఉందని ఆయన చెప్పారు అని చెబుతున్నారు. ఒక పార్టీగా జనసేన నెమ్మదిగా ఎదగాల్సి ఉందని కూడా సూచించారు. ఏతా వాతా నాదెండ్ల మనోహర్ చెప్పేది ఏంటి అంటే బలం ఉన్న చోటనే పోటీ అని. మరి ఆ బలం ఎంత ఉంది ఏమిటి అన్నది ఎవరు తేలుస్తారు అన్నదే ఇపుడు జనసైనికులకు కలుగుతున్న కీలక ప్రశ్న. జనసేన బలం ఇంతే అని ఇచ్చినన్ని సీట్లు తీసుకుంటే ఇంక మనం ఎప్పటికి ఎదిగేది అని జనసైనికులు అయితే మండిపడుతున్నారు. ఏ పార్టీ అయినా కొత్తగా స్థానాలలో పోటీ చేస్తే కదా బలం ఎంత ఉంది అన్నది తెలిసేది అని ప్రశ్నిస్తున్నారు.

జనసేనకు ఏపీ అంతా అవసరం లేదు కేవలం కృష్ణా,ఈస్ట్, వెస్ట్, వైజాగ్ ఇలా చూస్తే నాలుగు జిల్లాల్లో టీడీపీ-జనసేన బలం 60-40 గా ఉంటునని కూడా జనసైనికులు సూచిస్తున్నారు. కాబట్టి ఈ నాలుగు జిల్లాల్లో అయినా 60-40 పద్ధతిలో సీట్లు పంచటం న్యాయం అని వాదిస్తున్నారు. ఇక్కడ చూస్తే మేయర్ జెడ్పీ పీఠాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వీటితో పాటు మునిసిపాలిటీలలో కూడా జనసేనకు న్యాయమైన వాటా ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తానికి నాదెండ్ల అయితే చెప్పాల్సింది చెప్పారు అంటే జనసేనకు ఎన్ని సీట్లు దక్కుతాయన్న గుబులు అయితే పార్టీ వర్గాలలో ఉంది. తొందరలోనే చంద్రబాబు పవన్ బీజేపీ నేతలు సీట్ల సర్దుబాటు మీద కూర్చో బోతున్నారు అని అంటున్నారు. జనసేనకు నిజంగా 30 శాతం ఫార్ములా ప్రకారం సీట్లు వస్తాయా లేక నాదెండ్ల చెప్పినట్లుగా బలం ఉన్న చోట్ల సీట్లు దక్కుతాయా అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# ఎల్‌నినోతో పుట్టెడు కష్టాల్లో రైతన్నలు

**ఇన్సూరెన్స్ కంపెనీలతో అందేది అంతంతే**

**వ్యవసాయ శాఖ అంచనాలతో పరిహారం ఇప్పించాలని డిమాండ్**



**హైదరాబాద్ (ప్రజావినికిడి):**
ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై తీవ్రంగా ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో వరిపైర్లతో పాటు మెట్ట పంటలూ ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలకు గురవుతు న్నారు. పత్తి పంట విషయానికొస్తే ఎకరానికి సగం దిగుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. కౌలు రైతుల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. అటు కౌలుప రంగాడఇటు పంట విషయంలోనూ నష్టపో వాల్సిన దైన్యస్థితి నెలకొంది. పంట నష్ట పరిహారాన్ని అంచనా వేయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నాయి. కంటింజెన్సీ ప్లాన్ అమలు చేస్తున్నామనే మాటలు గొప్పలు చెప్పుకోవడానికే పరిమితం అవుతున్నాయి. అటు పంటల బీమా లేక..ఇటు పాలకుల నుంచి భరోసా లభించక రాష్ట్ర రైతాంగం మరోసారి అరిగోసకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రకటించిన ఫసల్‌బీమాలో చేరలేదు కాబట్టి మేం ఏం చేయలేమని మోడీ సర్కార్ చేతులెత్తేస్తుంది. కానీ అన్నదాతలను ఆదుకునేందుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తులు చేసి, ఎల్‌నినో రాజకీయాన్నిరక్తి కట్టిస్తున్నది.

**19 జిల్లాల్లో కరువు**

తెలంగాణలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి నేటి వరకూ రాష్ట్రంలో 20 శాతానికపైగా లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 16 వరకు సాధారణ 664.5 మిల్లీమీటర్ల (మి.మీ.,)కుగానూ 536.5 మి.మీ., వర్షపాతమే నమోదైంది. 33 జిల్లాలకుగానూ 19 జిల్లాలు వర్షాభావ కేటగిరీలో ఉన్నాయి. వానాకాలం పంటల సాగు 88 శాతానికే పరిమితమైంది. వరి సాగు దాదాపు 18 శాతం తగ్గింది.

వరి 55.90 లక్షల ఎకరాలు, పత్తి 48.33 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5.93 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.72 లక్షల ఎకరాలు, మిర్చి 2.67 లక్షల ఎకరాలు, చెరుకు 41 వేల ఎకరాలలో సాగైంది.

ఓవైపు భూగర్భజలాలు లోతుల్లోకి పడిపోవడం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు అడుగండటంతో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వరిపైర్లు ఎండిపోతున్నాయి. వరి తర్వాత అత్యధికంగా సాగు చేసేది పత్తి పంటనే. తెలంగాణలో భూమి స్వభావాన్ని బట్టి ఎకరాలో సగటున 8 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు పండాలి. కానీ, వర్షాభావ పరిస్థితులతో ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పత్తి మొక్కలు జానెడు నుంచి మూరెడు ఎత్తు వరకు మాత్రమే పెరిగాయి. ఎండలను తట్టుకోలేక మొక్కలు వడలిపోతున్నాయి.

**ఎన్‌నినో ఎఫెక్ట్**

ఫసల్‌బీమా యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రీమియం వాటా ఎక్కువగా ఉండటం, ఆయా రాష్ట్రాల్లో సొంతంగా బీమా పథకాలు ఉండటం, పరిహారం విషయంలో జాప్యం వల్ల చాలా రాష్ట్రాలు ఆ పథకం నుంచి వెనక్కి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన పంటలనే వేయాలనే నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. ఈ కారణంతోనే ఏపీ, తెలంగాణ, గుజరాత్, బెంగాల్, తదితర రాష్ట్రాలు ఈ బీమాలో చేరేందుకు ఆసక్తి చూపలేదు. రాష్ట్ర ప్రీమియం వాటా కంటే రైతులకు ఎక్కువ లబ్ది చేకూరుస్తున్నామంటూ ఆ పథకం నుంచి తెలంగాణ వెనక్కి వచ్చింది. అయితే, తెలంగాణ మినహా మిగిలిన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా రైతుల కోసం బీమా పథకాలను తీసుకొచ్చాయి. తెలంగాణలో మాత్రం అలాంటి పథకం లేదు. ఫసల్‌బీమా పథకం వల్ల బీమా కంపెనీలకు ఎక్కువ ఉపయోగం జరుగుతున్నదనీ, రైతుల క్లైయిమ్‌ల విషయంలో అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పరిహారం ఇవ్వడంలో జాప్యం జరుగుతున్నదనే చర్చ కూడా ఉన్నది.ప్రపంచ పటాలు పరిశీలించండి

**రైతు బంధుకు బీమా కొర్రి**

రాష్ట్రంలో రైతుబంధుతో పాటు రైతులకు నేరుగా రూ.ఐదు లక్షల బీమా ఇస్తున్నామనే కారణంతో పంట నష్టపరిహారాన్ని నిరాకరిస్తూ వచ్చారు. 2018 ఎన్నికల సమయంలో ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇచ్చారు. ఆ తర్వాత ఏ ప్రభుత్వం కూడా పరిహారంపై పల్లెత్తు ప్రకటన చేయకపోవడం గమనార్హం. ,అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నష్టం గురించి ప్రస్తావించకుండా, వచ్చే రబీ సీజన్ నుంచి ఫసల్‌బీమా యోజన పథకంలో చేరుతా మని ప్రకటించింది. అదే సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి తగిన సహాయం చేయాలని కేంద్రాన్ని కోరింది. ఖరీఫ్ సీజన్‌లో తీవ్రంగా నష్టపోయిన రైతులు, ముఖ్యంగా కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి భరోసా కల్పించాల్సిన అవసర ముందని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్

**ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఈ ప్రయోజనం వర్తింపు**

**రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.30 లక్షల మంది సిబ్బందికి లబ్ధి**

**11వ పీఆర్సీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**ఇది ప్రమోషన్ కాదు, ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని స్పష్టీకరణ**




ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ూాూా) కింద స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ (ూ+ూ) మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 15,000కు పైగా ఉన్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 1.30 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా 2019, 2020 సంవత్సరాల్లో తొలి విడతలో నియమితులైన ఉద్యోగులకు ఈ స్కేల్ ప్రయోజనం చేకూరనుంది. 11వ వేతన సవరణ కమిషన్ (ూ=జ) చేసిన సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది.అయితే, ఇది రెగ్యులర్ పదోన్నతి కాదని, కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. ఒకే పోస్టులో ఎక్కువ కాలం పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో భాగంగానే ఈ స్పెషల్ గ్రేడ్ స్కేల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఏఏఎస్ నిబంధనల ప్రకారం, ఉద్యోగులకు 6 ఏళ్ల సర్వీసుకు స్పెషల్ గ్రేడ్, ఆ తర్వాత 12, 18, 24 ఏళ్ల సర్వీసుకు తదుపరి ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి.తాజా ఉత్తర్వుల నేపథ్యంలో, అర్హులైన ఉద్యోగుల సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్‌ను వెంటనే మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్, రేవంత్ నయా నిజాంలు.. ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 :** బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ఈ రెండు పార్టీలు అడ్డుకున్నాయని ధ్వజమెత్తారు. 'అసెంబ్లీలో నీవు కొట్టినట్లు చెయ్యి.. నేను ఏడ్చినట్లుగా చేస్తా అన్నట్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డ్రామాలు చేశారు' అని ఎద్దేవా చేశారు. వీరి డ్రామాలు ఒకేరకంగా ఉన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు తెలంగాణ అభివృద్ధి పట్టదని ఆగ్రహించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు బుల్లెట్ ప్రూఫ్ బస్సులో బీఆర్ఎస్ నేతల ఫాంహౌస్‌లకు వెళ్లడం అవసరమా.? అని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగం తప్ప ఏమి లేదని అన్నారు. (ఆదివారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో రఘునందన్ రావు మాట్లాడారు.దానం నాగేందర్‌కు బై ఎలక్షన్ అచ్చివచ్చినట్లుగా ఎక్కడ లేదు.భూముల రికార్డులన్నీ ప్రభుత్వం దగ్గర ఉన్నాయి కదా.. మళ్లీ వెళ్లి



చూడటం ఎందుకని రఘునందన్ రావు నిలదీశారు. దానం నాగేందర్‌కు బై ఎలక్షన్ అచ్చివచ్చినట్లుగా ఎక్కడ లేదని చెప్పారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని.. ఒకే తాను ముక్కలని విమర్శించారు. ప్రజలను పీడించిన నిజాం తరహాలోనే కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలన ఉందని ఆగ్రహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో నిజాంను పొగిడిన కేసీఆర్, రేవంత్ వీడియోలను రఘునందన్ రావు ప్రదర్శించారు. కేసీఆర్ లెక్కాపత్రం లేకుండా నిజాంను పొగిడారని మండిపడ్డారు. ఆదివాసీ బిడ్డలను ఇబ్బంది పెట్టింది ఎవరు.? అని ప్రశ్నించారు. రేవంత్, కేసీఆర్ ఇద్దరు ఎంఐఎంకు మద్దతుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఓల్డ్‌సిటీకి వెళ్లి ఇద్దరు మజ్లిస్‌ను పొగుడుతూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. నిజాం సర్కార్ కొలువుల్లో 90 శాతం ముస్లింలే ఉండేవారని తెలిపారు. మహిళలతో దారుణ ంగా బతుకమ్మలు ఆడించిన నిజాం గొప్పవారని కేసీఆర్, రేవంత్ పొగుడుతున్నారా.? అని ప్రశ్నించారు.బైరాన్‌ప ల్లి ఘటనకు కారణమైన నిజాం ఎలా గొప్పవా రు.?. .బైరాన్‌పల్లి ఘటనకు కారణమైన నిజాం ఎలా గొప్పవారు.? అని రఘునందన్ రావు నిలదీశారు. శాసనసభలో నిజాంను పొగడటా నికి ఆ ఇద్దరికి సిగ్గు లేదా.? అని ఎద్దేవా చేశారు. నిజాం గొప్పవారైతే సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన ఆపరేషన్ పోలో తప్పా.? అని ప్రశ్నించారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరు నయా నిజాంలు అని వ్యగ్యంగా మాట్లాడారు. నయా నిజాంలను తరిమికొట్టేం దుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించా రు. దాశరథి చెప్పిన నిజాం రాజు తరతరాల బూజు అన్నది తప్పా.? అని నిలదీశారు. కొమురం భీమ్, రాంజీ గోండు చేసిన ఉద్యమాలు తప్పా.? అని ప్రశ్నించారు. నిజాం మీద బాంబులు వేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ.. నారాయణ రావు పవార్ పోరాటం తప్పా.? అని అడిగారు. రామానంద తీర్థ, ఆర్య సమాజ్ చేసిన పోరాటాలు అర్థం లేనివా.? అని ప్రశ్నించారు. నేడు కేసీఆర్ వెంట, నేడు కాంగ్రెస్ వెంట నడిచిన తోకపార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అని ఎద్దేవా చేశారు. అన్ని విషయాలను ప్రజలు గమనిస్తు న్నారని రఘునందన్ రావు పేర్కొన్నారు.

# సూర్యాపేటలో ఘోర ప్రమాదం.. కారులో సజీవదహనమైన వైద్యుడు



**సూర్యాపేట:** డివైడర్‌ను ఢీకొట్టి కారులో చెలరేగిన మంటలు ఖమ్మం న్యూరో సర్జన్ కాసకుర్తి జగదీశ్ సజీవదహనం తలుపులు లాక్ అవ్వడంతో బయటకు రాలేకపోయిన వైద్యుడు సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లలమర్రి శివారులోని హైదరాబాద్-ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది.వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి.దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాన్స్‌జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీ లకు చెరో 8 ఎంపీ స్థానాలు ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీష్ రావు ప్రైవేటు ప్రాపర్టీపై దాడి చేయడానికి వెళ్లారు. కాంగ్రెస్ వాళ్లు చెప్పి మరీ వెళ్తుంటే డీజీపీ ఏం చేస్తున్నారు. ఎంపీలు చేయాల్సిన పని ఇదేనా...? అని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అరికెపూడి గాంధీ అనే ఎమ్మెల్యే పోలీసుల సహాయంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని చంపడానికి వెళ్లారు. పోలీసు బందోబస్తుతో హరీశ్ రావు పొలాలకు కాంగ్రెస్ వాళ్లను పంపించారు. సీఎం ప్రైవేటు ఆస్తుల వద్దకు వెళ్తే ఊరుకుంటారా..? ప్రజలు మిమ్మల్ని అధికార పీఠం మీద కూర్చోబెట్టింది ఇందుకేనా..? తెలంగాణలో భూ దందా నడుస్తోంది . తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతున్నారన్నారు.నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పార్లమెంట్ నియోజకవర్గం గద్వాలలో కులాంతర వివాహం చేసుకున్నందుకు దళిత కుటుంబంపై దాడి జరిగింది. ట్రాన్స్ జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదు. ట్రాన్స్ జెండర్లు కనీసం పోలీసులు చెప్పింది పాటిస్తున్నారు. ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ఒక్కో ఎంపీకి 8 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. ప్రతి సంవత్సరం రూ.5 కోట్లు ఎంపీ ల్యాడ్స్ కింద నిధులు ఇస్తుంది.




# కేటీఆర్.. కోట్ల ఆస్తులు మీకు ఎలా వచ్చాయి: ఎంపీ చామల సూటి ప్రశ్న

**రంగారెడ్డి:** తెలంగాణ రాజకీయాల్లో భూములు, ఫామ్‌హౌస్‌ల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుకు సంబంధించినవిగా ఆరోపిస్తున్న అజీజ్ నగర్ భూములను కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ఆదివారం ఫీల్డ్ విజిట్ చేపట్టింది. ప్రజా భవన్ నుంచి బయలుదేరిన నేతలు తొలుత అజీజ్ నగర్‌లోని ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి సంబంధించిన ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈ బృందంలో ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ యాదవ్, మల్లు రవి, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. 'సిద్దిపేట రంగనాయక్ సాగర్‌లో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. సిద్దిపేటలో లావోని పట్టా భూములను ఆయన బదిలీ చేసుకున్నారు. నేడు అజీజ్ నగర్ ఫీల్డ్



విజిట్‌కి వచ్చాము. తమ ఆస్తులు పూర్వీకుల నుంచి వచ్చాయని కేటీఆర్ అంటున్నారు. తాము ఆగర్భ కోటీశ్వరులమని ఆయన చెబుతున్నారు. వారిది చింతమడక.. ఫామ్‌హౌస్‌లు ఉన్నవి జన్వాడ, ఎర్రవల్లి, అజీజ్ నగర్. ఈ ఆస్తులన్నీ మీ తాతల ఆస్తులని చెబుతున్నారా?.. మేము డైవర్షన్ పాలిటిక్స్ చేయడం లేదు. సీఎం రేవంత్ ఆన్ రికార్డ్ శాసనసభలో చెప్పిన అంశాలను ప్రజలకు చెబుతున్నాం. జీవో 111 రూల్స్‌ను తుంగలో తొక్కి జన్వాడ, అజీజ్ నగర్‌లో నిర్మాణాలు చేశారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద 300 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. గత పదేళ్లుగా దళితులకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదు?, దోచుకోవాలనే ఉద్దేశంతోనే పట్టాలు ఇవ్వలేదు. పేద ప్రజలను అడ్డుపెట్టుకు ని సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ భావించారు. మీ ఆస్తుల వివరాలు అఫిడవిట్‌లో ఎందుకు వెల్లడించలేదు?. కేటీఆర్.. ఎమ్మెల్యేగా మీ జీతం ఎంత?. మీకు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయి?. 1,600 మంది బలిదానంతో కోట్ల ఆస్తులు కూడబెట్టారు. మేము ప్రైవేట్ ప్రాపర్టీస్ వద్దకు వెళ్లడం లేదు.. మేము అడిగే వాటికి కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు సమాధానం

# ఏపీ, తెలంగాణలో దసరా సెలవులపై క్లారిటీ వచ్చేసింది

**హైదరాబాద్ :** ఏపీ, తెలంగాణలోని విద్యార్థుకు భారీ శుభవార్త అందింది. దసరా సెలవుల లిస్టును తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. తెలంగాణలో ఒకలా.. ఏపీలో మరోలా సెలవులు ఉన్నాయి. ఈ మేరకు విద్యాశాఖలు దసరా సెలవుల లిస్టును విడుదల చేశాయి. దసరా వస్తుందంటే చాలు.. ముందుగా సెలవుల గురించే ఎక్కువ చర్చ జరుగుతూ ఉంటాయి. విద్యార్థులు పండుగ సెలవుల కోసం ఎదురుచూస్తుంటారు. సెలవుల్లో తమ సొంతూర్లకు వెళ్లి కుటుంబంతో సరదాగా గడుపుతుంటారు. ఏపీ, తెలంగాణలో విద్యాసంస్థలకు దసరా సెలవులు ఎప్పటినుంచి ఎప్పటివరకు అనేది ఇప్పుడు చూద్దాం.ఏపీ, తెలంగాణలో దసరా సెలవులు ఇవే..తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దసరాతో పాటు బతుకమ్మ కూడా వస్తుండటంతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9.



ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది. ఇక ఏపీ విషయానికొస్తే.. 10 రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవులు వచ్చాయి. 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 12 మొదలవుతాయి. అక్టోబర్ 21 వరకు మొత్తం 10 రోజుల పాటు సెలవులు కొనసాగుతాయి. ఏపీ, తెలంగాణలో సెలవులు భిన్నంగా ఉన్నాయి. అయితే క్రైస్తవ, మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించి సెలవులు భిన్నంగా ఉంటాయి.బతుకమ్మ పండుగ ఎప్పుడంటే..ఈసారి అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ వస్తోంది. ఇక బతుకమ్మ కూడా ఇదే తేదీలో వస్తోంది. అక్టోబర్ 11న బతుకమ్మ ప్రారంభం కానుండగా.. అక్టోబర్ 18వ తేదీన సద్దుల బతుకమ్మ జరగనుంది. తెలంగాణ ప్రజలు బతుకమ్మను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటారు. ఇక తెలంగాణలో అక్టోబర్ 1 నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతాయి. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు అక్టోబర్ 5 నుంచి 9 వరకు, 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు అక్టోబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తారు. సెలవుల నుంచి వచ్చిన తర్వాత ఫలితాలు వెల్లడించనున్నారు. ూూ-2 పరీక్షలు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వచ్చే ఏడాది ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 19 వరకు నిర్వహిస్తారు. పదో తరగతి ప్రీ-ఫైనల్స్ పరీక్షలు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి కానున్నాయి. దసరా సెలవులకు ముందే తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు పూర్తి చేస్తుంది.

# కరీంనగర్ జిల్లాలో రెచ్చిపోయిన దొంగలు.. రెండు ఎస్బీఐ ఏటీఎంల చోరీ.



**కరీంనగర్:** జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఏటీఎంలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడ్డారు. పోలీసులకు సవాల్ విసిరేలా పక్కా ప్లాన్‌తో దొంగతనాలు చేశారు. ఒక చోట సీసీ కెమెరాలను ధ్వంసం చేయగా, మరో చోట లేడీ గెటప్‌లో వచ్చి సీసీటీవీ కెమెరాలపై స్ప్రే కొట్టి మరీ నగదు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ జిల్లా దురిషేడ్‌లో ఎస్బీఐ ఏటీఎంను ముగ్గురు దుండగులు టార్గెట్ చేశారు. తెల్లవారుజామున సు మారు 3 గంటల సమయంలో స్కార్పియో వాహనంలో వచ్చిన దొంగలు ఏటీఎంలోకి చొరబడ్డారు. ముందుగా అక్కడి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత గ్యాస్ కట్టర్ సాయంతో క్యాష్ మిషన్‌ను కట్ చేసి అందులోని నగదును దోచుకున్నారు. చోరీ అనంతరం దుండగులు స్కార్పియో వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులు.. మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులు



**రంగారెడ్డి జిల్లా :** తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం దిశగా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మూడు జిల్లా కాంగ్రెస్ కమిటీలకు (డీసీసీ) నూతన అధ్యక్షులను నియమించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత, సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పటోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడిగా ఎండీ ముస్తఫా నియమితులయ్యారు. హైదరాబాద్ మహానగరానికి సమీపంలో ఉండే రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు రాజకీయంగా అత్యంత కీలకమైనవి కాగా, రామగుండం ప్రధాన పారిశ్రామిక ప్రాంతం కావడంతో పార్టీ ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా పార్టీని జిల్లా స్థాయిలో బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగానే ఈ నియామకాలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# '120' స్పీడ్‌తో గాల్లో కలుస్తున్న ప్రాణాలు ఓఆర్ఆర్ ఎక్కితే దిగుతామన్న గ్యారెంటీ లేదు!

**హైదరాబాద్ :** అజాగ్రత్త, అతి వేగం, నిర్లక్ష్యం ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై వరస ప్రమాదాలకు కారణ మవుతున్నాయి. మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఓఆర్ఆర్ 35 కిలోమీటర్లు విస్తరించి ఉంది. వీటిలో ముఖ్యంగా 9, 7, 6 ఎగ్జిట్ల పరిధిలో ఓఆర్ఆ ర్‌పైకి వచ్చే వాహనాలు ఎప్పటికప్పుడు ప్రమా దాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డెక్కితే తిరిగొస్తామో లేదో అనే భయం వాహ నదారుల్లో నెలకొంది. వేగానికి తోడు నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలుఈ సంవత్సరం ప్రారంభమయిన ప్పటి నుంచి నేటి వరకు 9 నెలల వ్యవధిలో ఓఆర్?ఆర్?పై 28 ప్రమాదా లు జరిగాయి. ఈ ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల సంఘటనల ను పరిశీలిస్తే మరమ్మతులకు గురైన వాహ ాలు రహదారి పక్కన నిలపడం వల్లే ప్రమాదా లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వెనక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు నిలిచి ఉన్న వాహ నాలను ఢీ కొనడంతోనే అనేక మంది మరణి స్తున్నట్లు తెలుస్తోంది.ఇంకో వైపు డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో నిద్ర మత్తులోకి జారుకోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతు న్నాయి. ప్రధానంగా ఓఆర్?ఆర్?పై వేగాన్ని 120 కి.మీలకు పెంచడంతో అంతే వేగంగా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా వాహనాలను రహదారి పక్కన నిలిపే విషయంలో భద్రతా



చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.వాహనాలను వేగంగా నడపటంతో ప్రమాదాలుఓఆర్ఆర్‌పై కొన్నిసార్లు వేగంగా నడుపుతున్న లారీలను అకస్మాత్తుగా నిలపడం వల్ల కూడా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు గచ్చిబౌలి నుంచి శంషాబాద్? విమానాశ్రయాని కి ఓఆర్ఆర్‌లో వెళ్తున్న కొందరు, వేగంగా కార్లను, వాహనాలను నడపడంతో ప్రమాదాల కు కారణమవుతున్నారు. కొన్నిచోట్ల సర్వీస్? రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డులోకి వచ్చేట పుడు వాహదారులు సిగ్నల్? వ్యవస్థను ఉపయోగించకుండా దూసుకురావడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ ప్రాంతంలో చెట్ల నరికివేత సమయంలో సంబంధిత హెచ్చరిక వ్యవస్థలను కూడా వినియోగించడం లేనట్లు వాహనదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైవే సిబ్బంది రోడ్డు పక్కన వాహనాలను నిలిపి ఉంచడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.ఎక్కువ ప్రమాదాలు అక్కడేఈ సంవత్సరం మార్చి నెలలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఓఆర్ఆర్ ఎగ్జిట్-7 దగ్గర కొందరు రోడ్డు పక్కన తమ వాహనాలను నిలిపి భోజనం చేస్తున్నారు. వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ మార్గంలోని ట్రామా కేర్? సెంటర్ల పరిధిలోనే నిత్యం ప్రమాదాలు జరుగుతాయని అక్కడి సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు.

# టేబుల్ టెన్నిస్‌లో అమ్మాయిల జోరు.. కాంస్య పోరులో డిసౌజాకు చుక్కెదురు..!



జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో భారత బృందం ఆకట్టుకుంటోంది. షూటర్ ఎలవెనిల్ రెండు వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో రజతంతో మెరవగా.. తెక్‌బాల్ కాంస్య పోరులో క్వింసీ డిసౌజా కు చుక్కెదురైంది. బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు ఫైనల్ చేరింది. బ్యాడ్మింటన్‌లో సింధు సేన క్వార్టర్స్ ఆడనుంది. హాకీలో పురుషుల, మహిళల జట్లు భారీ విజయంతో రెండో రౌండ్‌లో అడుగుపెట్టాయి. టేబుల్ టెన్నిస్‌లో అమ్మాయిల టీమ్ ముందంజ వేయగా.. అబ్బాయిల బృందం ఓడిపోయింది.నగోయలోని పార్క్ అథ్లెటిక్స్ స్టేడియంలో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో భారత్‌కు ఆదివారం మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత, బృందం విభాగాల్లో ఎలవెనిల్ వలరివన్ వెండి వెలుగులు విరజిమ్మింది. అపై మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ లో సుచికా తరియల్ సెమీస్ చేరిన పతకం ఖాయం చేసింది. అయితే.. తెక్‌బాల్‌లో సంచలన విజయాలతో ఆశలు రేపిన క్వింసీ డిసౌజా నిరాశపరిచింది. వ్యక్తిగత, మిశ్రమ విభాగాల కాంస్య పోరులో డిసౌజా ఓటమిపాలైంది. స్విమ్మింగ్ పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్లో రిషభ్ దాస్ ఆరో స్థానంలో నిలిచాడు.

# ఆసియా అదిరేలా..

## అట్టహాసంగా ఆసియా గేమ్స్ ప్రారంభోత్సవం



నగోయా: ఆసియా క్రీడాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటే ఆటల పండుగ మొదలైంది. నిర్వహణ లోపాలు, ఇరుకైన వసతుల వివాదాలను పక్కనబెడుతూ 20వ ఎడిషన్ ఆసియా గేమ్స్ అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఐచి-నగోయా వేదికగా హార్మోనిక్ హార్ట్‌బీట్ (హృదయాల స్పందన) అనే ప్రధాన ఇతివృత్తంతో సాగిన ప్రారంభోత్సవంలో ఆతిథ్య జపాన్ తన హైటెక్ పారిశ్రామిక శక్తిని, ప్రాంచీన సాంస్కృతిక మూలాలను ప్రపంచానికి చాటిచెప్పింది. మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య అధిపతి కోవర్ట్రీ, ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధ్యక్షుడు అల్ థానీ సమక్షంలో జపాన్ చక్రవర్తి నరుహిటో క్రీడలను అధికారికంగా ప్రారంభించారు. అక్టోబర్ 4 వరకు జరిగే మెగా ఈవెంట్‌లో 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు 43 క్రీడల్లో పోటీపడనున్నారు.మీుజూం సాంకేతికత, సంస్కృతిని జోడించి 1958 (టోక్యో), 1994 (హిరోషిమా) తర్వాత మూడోసారి ఆసియాడ్‌కు ఆతిథ్యమిస్తున్న జపాన్ ఆరంభ వేడుకల్లో తన మార్కును చాటుకుంది. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఓపెనింగ్ అందరినీ ఆకట్టుకుంది. ఆసియా ఖండమంతా హృదయపూర్వకంగా అనుసంధానం కావాలనే భావనకు సంకేతంగా ప్రధాన వేదికను గుండె ఆకారంలో తీర్చిదిద్దారు. జపాన్ సాంప్రదాయ కాబుకి రంగాన్ని, పారిశ్రామిక నగరమైన నగోయా ప్రతీకగా జెండా ఊపుతున్న భారీ రోబోటిక్ హ్యాండ్‌ను ప్రదర్శించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు టారో హకాసే సంగీతానికి అనుగుణంగా గుండె ఆకారపు రెక్కలున్న డ్రోన్లు, లేజర్ వెలుగులు స్టేడియాన్ని కాంతివంతం చేశాయి. వేదిక కింద నుంచి వచ్చిన 240 మంది డ్యాన్సర్లు ఆయా దేశాల క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్నట్టుగా వెల్‌కమ్ అనే అక్షరాలను నృత్య రూపకంతో ఆవిష్కరించారు. వేడుకల రెండో భాగం ఐచి-నగోయా ప్రాచీన సంస్కృతిని, ఆధునిక సాంకేతిక ప్రతిభను ఆవిష్కరించింది. పాతకాలపు గడియారాల తయారీ నుంచి నేటి డిజిటల్ సాంకేతికత వరకు సాధించిన ప్రగతిని చాటుతూ నిర్వహించిన లేజర్ షో, ఎల్‌ఈడీ నృత్యాలు అలరించాయి. టార్చ్ రిలే ముగింపులో ప్రధాన జ్యోతిని వెలిగించడంతో ప్రారంభోత్సవం ముగిసింది. ఆకట్టుకున్న భారత మార్చ్‌పాస్ట్ 46 జట్ల మార్చ్‌పాస్ట్‌లో భారత బృందం ఎంతో ఉత్సాహంగా ప్రవేశించింది. స్టార్ షూటర్ మను భాకర్ ముదురు నీలం రంగు చీరలో, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ బంద్ గలా జాకెట్‌లో భారత జాతీయ పతాకాన్ని చేతబూని 150 మంది సభ్యుల క్రీడా దళాన్ని ముందుండి నడిపారు.

## జట్టుకు, దేశానికి చాలా చేయాలనుంది.. కెప్టెన్‌గా ఆఖరి మ్యాచ్ అదే..!

ఆసియా క్రీడల సెమీఫైనల్లో ఓటమి అనంతరం బంగ్లాదేశ్ కెప్టెన్ నిగర్ సుల్తానా కీలక నిర్ణయం తీసుకుంది. భారత జట్టు చేతిలో 114 పరుగుల ఓటమిని తట్టుకోలేని టీ20 ఆమె కెప్టెన్సీ వదులుకుంది. మ్యాచ్ తర్వాత బాధను దిగమింగుతూ ఈ విషయాన్ని తను మీడియాతో వెల్లడించింది. బ్యాటింగ్ మీద దృష్టి సారించడం కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు సుల్తానా తెలిపింది. అయితే.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నుంచి తనకు సరైన సహకారం లభించకపోవడంతోనే ఆమె స్వచ్ఛందంగా వైదొలగాలని భావించినట్టు సమాచారం.బంగ్లాదేశ్ మహిళల జట్టుకు మరో షాక్. ఇటీవలే ఆసియా కప్‌లో, ఆదివారం ఆసియా క్రీడల్లో భారత జట్టు చేతిలో కంగుతిన్నందున నిగర్ సుల్తానా స్వచ్ఛందంగా కెప్టెన్సీ నుంచి వైదొలగింది. బోర్డు నుంచి సరైన సహకారం అందకపోవడంతోనే ఆమె ఈ నిర్ణయం తీసుకుందని టాక్. కానీ, తను మాత్రం బ్యాటింగ్ మీద దృష్టి సారించాలని కెప్టెన్సీ వద్దనుకున్నట్టు మీడియాతో చెప్పింది. 'నేను బాధపడి కెప్టెన్సీ వదులుకున్నాని అనడం నిజం కాదు. బ్యాటర్‌గా, ప్లేయర్‌గా జట్టుకు, దేశానికి నేను చాలా చేయాలనుకుంటున్నా. అందుకని బ్యాటింగ్ మీద ఫోకస్ పెట్టాలనుకుంటున్నా. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా' అని మీడియాతో పేర్కొంది సుల్తాన. టీమిండియా నిర్దేశించిన 196 పరుగుల భారీ ఛేదనలో 81కే కుప్పకూలడంపై స్పందించిన ఆమె.. భారత్‌ను తక్కువకే నిలువరించి ఉండాల్సిందని అభిప్రాయపడింది.'భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మెరుగైన బౌలింగ్ దళం ధాటికి వికెట్లు కోల్పోవడం సహజమే. మేము భారత్‌ను తక్కువకే కట్టడి చేయాల్సింది. స్వల్ప స్కోర్‌కే జట్టు పరిమితమైనప్పుడు బ్యాటర్లం కచ్చితంగా బాధ్యత తీసుకోం. కానీ, టాపార్డర్‌లో ఒక్కరు చివరిదాకా నిలబడినా.. మేము మరికొన్ని రన్స్ చేసేవాళ్లం. అయితే.. ఇక్కడ సాధనకు అనువైన సౌకర్యాలు లేవు. చైనాతో మ్య?చ్‌లో మా టీమ్ మంచి ప్రదర్శన చేసింది. కానీ, అవకాశాన్ని అందిపుచ్చుకోలేదు. మొత్తంగా జట్టుగా మేము చెత్త క్రికెట్ ఆడాం' అని సుల్తాన తెలిపింది.





# షెఫాలీ శతక మోత ఫైనల్లో టీమిండియా

నిషిన్ : డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళా క్రికెట్ జట్టు ఆసియాడ్‌లో మరోసారి పసిడి పోరుకు సిద్ధమైంది. ఆదివారం ఏకపక్షంగా సాగిన రెండో సెమీ ఫైనల్స్‌లో షెఫాలీ వర్మ (49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్సలతో 100 నాటౌట్) అజేయ శతక గర్జన చేయగా టీమిండియా 114 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. షెఫాలీకి తోడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (40), స్మృతి మంధాన (37) ధనాధన్ ఆటతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లకు 4 వికెట్ల నష్టపోయి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది.లక్ష్యఛేదనలో బంగ్లా 15.4 ఓవర్లకు 81 రన్స్‌కే కుప్పకూలింది. ఓపెనర్ దిలారా అక్తర్ (27) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ (3/7), శ్రీచరణి (2/7) స్పిన్ మాయకు తోడు నందని శర్మ (3/25) తన పేస్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను క్రీజులో నిలువనీయలేదు. మరో సెమీస్‌లో శ్రీలంక.. పాకిస్థాన్‌ను ఓడించి ఫైనల్ చేరింది. మంగళ వారం ఇదే వేదికలో భారత్, శ్రీలంక ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.1 టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా మంధాన (4,788) సుజీ బేట్స్ (4,758) ను అధిగమించి ఈ ఫార్మాట్‌లో టాప్ రన్ స్కోరర్‌గా నిలిచింది.



# అబ్బాయిల జైత్రయాత్ర.. అమ్మాయిలకు బ్రేక్

సమర్‌కండ్ : చెస్ ఒలింపియాడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్ ఐదో రౌండ్‌లోనూ అదే జోరు కొనసాగించింది. ఓపెన్ కేటగిరీలో భారత్ 3-1తో హాలండ్‌పై గెలిచి వరుసగా ఐదో విజయాన్ని నమోదుచేసింది. ప్రజ్ఞానంద.. అనీష్ గిరిని ఓడించగా జోర్డెన్ వాన్ ఫారీస్ట్‌తో మ్యాచ్‌ను అర్జున్ డ్రా చేసుకున్నాడు. నిహాల్ సైతం వాన్ విలీతో పాయింట్‌ను పంచుకోగా గుకేశ్.. ఎర్విన్‌ను ఓడించాడు. కానీ మహిళల విభాగంలో భారత్‌కు 1.5-2.5తో పోలండ్ షాకిచ్చింది. హంపి, దివ్య, వంతిక మ్యాచ్‌లు డ్రా గా తేలగా వైశాలి ఓటమిపాలైంది.



# సమంత స్థానంలో?

సినిమాల్లో కథానాయికల మార్పు సాధారణమే. అయితే ఓ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో ఓ నాయిక స్థానాన్ని మరొకరు భర్తీ చేయడం మాత్రం చాలా అరుదు. ఇప్పుడు అలాంటి మార్పే 'చెన్నై స్టోరీ' విషయంలో జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌లో తొలుత సమంతను కథానాయికగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు విరామం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమంత స్థానంలో శృతిహాసన్‌ను కథానాయికగా ఎంపిక చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. బాఫ్టా అవార్డు విజేత, డౌన్‌టౌన్ అబ్బే వంటి సినిమాలతో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న ఫిలిప్‌జాన్ దర్శకత్వంలో 'చెన్నై స్టోరీ' తెరకెక్కుతున్నది. టిమెరి ఎన్ మురారి రచించిన 'ది అరెంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చెన్నై, ఇంగ్లాడ్‌లోని వేల్స్ నేపథ్యంలో సాగే ఈ కథలో కథానాయిక ప్రైవేట్ డిటెక్టివ్ పాత్రలో కనిపించనుంది. అయితే ఈ సినిమా నుంచి సమంత తప్పుకున్న విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. అంతర్జాతీయ నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

## అందానికి అమ్మమ్మ చిట్కా

'ఛలో' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ కస్తూరి రష్మిక మందన్న. ఈ ముద్దుగుమ్మ హీరో విజయ్ దేవరకొండను పెండ్లి చేసుకొని తెలంగాణ కోడలైంది. పుష్ప లాంటి బ్లాక్‌బస్టర్‌లో నటించిన రష్మిక తన భర్త విజయ్‌తో కలిసి 'రణబాలి'లో జతకట్టింది. ముచ్చటగా మూడోసారి దేవరకొండతో నటిస్తున్నా.. పెండ్లి తర్వాత ఈ జంట కలిసి చేస్తున్న మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా ఈ బ్యూటీ పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి..గర్భధారణ చిట్కాలు నేర్చుకోండిఇటీవల షూటింగ్‌లో గాయపడటంతో ఇంటికే పరిమితమయ్యాను. ఇన్నిరోజులు ఇంట్లో ఉండటం నా కెరీర్‌లోనే మొదటిసారి అనుకుంటా. షూటింగ్‌ల వల్ల నిత్యం ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లే నాకు ఇదో కొత్త అనుభవం. పెండ్లయిన తర్వాత కూడా విజయ్, నేను మూడు నెలలపాటు ఒకరినొకరం చూసుకోలేదు. పెండ్లి తర్వాత ఇంట్లోవాళ్లతో గడిపే అవకాశం లభించినందుకు ఒకింత సంతోషంగా ఉంది.తాజా సినిమాలు చూడండిరణబాలితో పాటు 'మైసా'లో లీడ్ రోల్ చేస్తున్నాను. ఇందులో గోండు తెగకు చెందిన వారియర్‌లా కనిపిస్తాను. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కఠిన శిక్షణ తీసుకున్నాను. ఇందులో నీటి అడుగున శ్వాస బిగబట్టి చేసే యాక్షన్ సీన్ చేశాను. ఆసియాలోనే ఈ తరహా సీన్ చేసిన తొలి ఫీమెల్ యాక్టర్ నేనే అనుకుంటా.దేవరకొండ కుటుంబంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. మా అత్త స్వీట్‌గా, పసిపాపలాగా అమాయకంగా ఉంటుందని నేను ముద్దుగా ఆమెను 'పాపా' అని పిలుస్తాను. విజయ్‌కు సీరియస్ డ్రామాలు, షోలంటే ఇష్టం. నాకేమో కొరియన్ డ్రామాలు అంటే పిచ్చి. ఇప్పుడు ఆయనకు కూడా కే-డ్రామాలు అలవాటు చేశాను.నా దృష్టిలో సక్సెస్ అంటే పర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండటమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు.బిజీ షెడ్యూల్లో కాస్త తీరిక దొరికినప్పుడు స్కిన్, హెయిర్ కేర్ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. గోరు వెచ్చని కొబ్బరి నూనెను ముఖానికి, తలకు పట్టించి చక్కగా మర్దనా చేసుకుంటా. ఏ మాయిశ్చరైజర్, హెయిర్ కండీషనర్ అవసరం లేదు. వీలు దొరికినప్పుడల్లా నేను ఇదే చేస్తా. ఇది మా అమ్మమ్మ, అమ్మ చెప్పిన చిట్కా



## ఎర్ర చీరలో కట్టిపడేస్తున్న అందం.. శోభిత ఫొటోలు వైరల్

### అడవి నేపథ్యంలో వైల్డ్ యాక్షన్‌తో సత్యదేవ్..

# 'సమవర్తి' టీజర్ రిలీజ్

వర్సటైల్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'సమవర్తి'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక టీజర్‌ను లాంచ్ చేశారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో తీవ్ర చర్చనీయాంశమైంది.ప్రకృతికి, మానవులకు మధ్య నడిచే సంఘర్షణ, అడవుల అక్రమ నరికివేత, గిరిజనుల జీవన విధానం వంటి సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్ ఆరంభంలో వచ్చే వైవిధ్యమైన వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని కలిగిస్తుంది. ఇక ఈ చిత్రంలో 'మహాదేవ్' అనే వైల్డ్ అండ్ రగ్డ్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నారు. ఆయన గెటప్, తెలంగాణ యాసలో చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు, ముఖ్యంగా టీజర్ ముగింపులో వచ్చే "ఈసారి మిస్ అవ్వదు" అనే డైలాగ్ సినిమాపై హైప్‌ను తారాస్థాయికి చేర్చాయి.తెలంగాణ వార్తలుఅడవులు, ప్రత్యేకమైన లొకేషన్లలో అత్యంత సహజసిద్ధంగా తెరకెక్కించిన విజువల్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరిలో చూపించిన పులి ఎంట్రీ సీన్ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇందులో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ప్రొడక్షన్స్ సంస్థలు అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.







# ఓటీటీలోకి ఎం.ఎస్. రాజు క్రేజీ థ్రిల్లర్ 'అగధ'.. స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్!

ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన తాజా సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'అగధ'. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఆగస్ట్ 14వ తేదీన థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులను పలకరించింది. అయితే, విడుదలకు ముందు భారీ అంచనాలు క్రియేట్ చేసినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. సినిమాలోని కాన్సెప్ట్ కొత్తగా ఉన్నప్పటికీ, సాధారణ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో కాస్త వెనుకబడిపోయింది. ఈ నేపథ్యంలో, థియేటర్లలో మెప్పించలేకపోయిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ద్వారా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం జీ5 ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ తేదీని అధికారికంగా ఖరారు చేసింది. సెప్టెంబర్ 25 నుంచి ఈ సినిమా జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మరి థియేట్రికల్ రన్‌లో విఫలమైన ఈ సినిమా, డిజిటల్ ఆడియన్స్‌ను ఏ విధంగా అలరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో జోవికా విజయ్‌కుమార్, షిజు, రోషన్ బషీర్, శ్రేయ రాణి రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. రాకేష్ వెంకటాపురం ఈ సినిమాకు సంగీతం అందించడమే కాకుండా పాటలను కూడా సమకూర్చారు. 'అగధ' అనే పదానికి లోతైన అంశం లేదా శూన్యం అని అర్థం. కంటికి కనిపించని దైవిక శక్తులు మరియు దెయ్యం లాంటి దుష్ట శక్తుల మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాటమే ఈ చిత్ర ప్రధాన కథాంశం. దేవుడికి వ్యతిరేకంగా పనిచేసే ఓ శక్తివంతమైన దుష్ట శక్తినే ఈ సినిమాలో 'అగధ'గా అత్యంత ఉత్కంఠభరితంగా చూపించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613